ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 31 మార్చి 2024



మూగ యాత్ర..!

అభివాదంతో సరిపెట్టిన సీఎం జగన్

- వైసీపీ అభ్యర్థులు, శ్రేణుల్లో తీవ్ర నిరాశ
- గుత్తిలో జనంలోంచి జగన్ మీదకు చెప్పు
- అంబులెన్స్‌కు దారి వదలకుండా.. రోడ్ షో



గుత్తి: జనంకంటే పోలీసులే ఎక్కువ



గుత్తిలో సీఎం జగన్ రోడ్ షో

అనంతపురం క్రైం, మార్చి 30: జిల్లాలో సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర వైసీపీ శ్రేణులు, ఆ పార్టీ నాయకులను తీవ్ర నిరాశకు గురిచేసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బందోబస్తుకు వచ్చిన పోలీసులు మినహా.. ఎక్కడా జనం పెద్దగా కనిపించలేదు. 'మేమంతా సిద్ధం' రోడ్ షోను విజయవంతం చేసేందుకు మద్యం, మాంస సరఫరా చేసి.. జనాన్ని తరలించే ప్రయత్నం చేశారు. మత్తులో కొందరు కార్యకర్తలు చిందులు వేస్తూ కనిపించారు. రోడ్ షో జరిగే ప్రాంతాలలో శనివారం మధ్యాహ్నం నుంచే రోడ్డుకు ఇరువైపులా కార్యకర్తలు నిలబడి, గంటల కొద్దీ వేచి చూశారు. జగన్ ప్రసంగిస్తే తమకు ఉపయుక్తంగా ఉంటుందని అభ్యర్థులు భావించారు. కానీ జగన్ అభివాదంతోనే సరిపెట్టారు.

అంబులెన్స్‌కూ దారి వదల్లేదు

సీఎం బస్సు యాత్ర జిల్లాలోకి సాయంత్రం నాలుగు గంటలకు ప్రవేశించింది. గుత్తి మండలం బసినేపల్లి సమీపంలో జగన్ బస్సుకు ఎదురుగా, ఆదోనికి వెళ్లే అంబులెన్స్ వచ్చింది. భద్రత విధుల్లో ఉన్న పోలీసులు గాని, అక్కడున్న వైసీపీ నాయకులుగాని అంబులెన్స్‌కు దారి ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు. ఎదురుగా సీఎం జగన్ బస్సు వస్తుండటంతో సుమారు పది నిమిషాల పాటు అంబులెన్సు ఆగిపోయయింది. సీఎం బస్సు ముందుకెళ్లాక అంబులెన్స్ వెళ్లాల్సి వచ్చింది.



స్పందన అంతంతే...

మేమంతా సిద్ధం బస్సు యాత్రకు స్పందన అంతంతగానే కనిపించింది. బస్సు యాత్ర గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని గుత్తి, మిడుతూరు, పామిడి మీదుగా.. శింగనమల, అనంతపురం అర్బన్, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో సాగింది. కల్లూరు, గార్లదిన్నె, సోములదొడ్డి, అనంతపురం నగరంలోని తపోవనం సర్కిల్, రాప్తాడు, క్రిష్ణంరెడ్డిపల్లి మీదుగా.. ధర్మవరం నియోజకవర్గంలోని సంజీవపురం వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రం వరకూ రోడ్ షో సాగింది. గుత్తి పట్టణంలో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ పార్టీ శ్రేణుల నుంచే కాదు... ప్రజల నుంచి స్పందన అంతంతే కనిపించింది. కొన్నిచోట్ల పార్టీ శ్రేణుల కంటే పోలీసులే ఎక్కువగా కనిపించారు. గుత్తిలో జనంలోంచి ఒకరు జగన్‌పైకి చెప్పు విసరడం కలకలం రేపింది.

స్తంభించిన ట్రాఫిక్

సీఎం జగన్ బస్సు యాత్రతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో యాత్ర సాగిన అన్ని ప్రాంతాలలో ఇదే పరిస్థితి కనిపించింది. ప్రధాన కూడళ్లలో సీఎం బస్సు ఆగిన సందర్భాల్లో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. గుత్తి ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు మూడు గంటలు బస్టాండులోనే బస్సుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.

కార్యకర్తల్లో నిరుత్సాహం

తమ నాయకుడు వస్తే జేజేలు పలకాలని భావించిన వైసీపీ శ్రేణులు జగన్ తీరుతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఎక్కువ సమయం బస్సులో నుంచే అభివాదం చేశారు. పామిడి మండలం గజరాంపల్లి వద్ద బస్సు నుంచి కిందకు దిగారు. జనసేనకు చెందిన జంగంపుల్లారెడ్డి యాదవ్‌కు వైసీపీ కండువా కప్పారు. అనంతరం బస్సు ఎక్కిన జగన్, కల్లూరు వరకు బస్సు దిగలేదు. గార్లదిన్నె మండలం కల్లూరులో బస్సు టాప్‌పైకి ఎక్కి పది నిమిషాల పాటు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. అనంతపురం రూరల్ మండలం పాపురాయిలో కనీసం బస్సు అద్దం కూడా తీయకుండానే జగన్ చేయి ఊపారు. దీంతో ఆయన్ను చూసేందుకు వచ్చిన వైసీపీ కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. అనంతపురం నగర శివారులోని నేషనల్ పార్క్ ఎదుట గజమాలతో సత్కరించడంతో బయటకు వచ్చారు. మరోసారి తపోవనంలో బస్సులో నుంచి బయటకు వచ్చారు. అక్కడ అభివాదం చేశారు. జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. అనంతరం రాప్తాడు నుంచి పంగల్‌రోడ్డు, ఎస్కేయూ మీదుగా క్రిష్ణంరెడ్డిపల్లికి చేరుకున్నారు. అక్కడి నుంచి సంజీవపురం వరకు యాత్ర కొనసాగింది. సంజీవపురంలో బస చేశారు.

మందేశాడు.. పడిపోయాడు

కిక్కెక్కించిన జేబ్రాండ్



గుత్తి రూరల్, మార్చి 30: జే బ్రాండ్ మద్యం వైసీపీ కార్యకర్తలకు బాగానే కిక్కిచ్చినట్లుంది. అందుకే జగన్ రాకముందే బాగా తాగి పడిపోయారు. ఈ సంఘటన శనివారం గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డుపై జరిగింది. మేమంతా సిద్ధం బస్సు యాత్ర కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాలోని గుత్తి మండలంలోకి ప్రవేశించింది. రోడ్ షోకు జనసమీకరణ భారీగా చేసి విజయవంతం చేయాలని వైసీపీ నాయకులు భావించారు. ఈక్రమంలోనే కార్యకర్తలను తరలించారు. వారికి జేబ్రాండ్ మద్యం తాపించారు. దీంతో కిక్కు ఎక్కువ కావడంతో రోడ్డు పక్కన్న ఉన్న షాపుల ముందు కొందరు పడిపోయారు. మరి కొంత మంది తాగి రోడ్లపై తూలుకుంటూపోయారు.

నమో నారసింహా..!

కదిరిలో స్వామివారి రథోత్సవం.. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు








ఖాద్రీశుడి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాది మంది తరలివచ్చారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవంలో స్వామివారి వైభవాన్ని కన్నులారా వీక్షించేందుకు మండే ఎండను లెక్కచేయకుండా క్షేత్ర వీధుల్లోకి వచ్చారు. వీధులు కిక్కిరిసిపోవడంతో కొందరు మిద్దెలపైకి ఎక్కారు. గోవింద నామస్మరణలు మిన్నంటుతుండగా.. తిరువీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుడు రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన దవనం, మిరియాలను సమర్పించి, భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

- 7లో...

టైమొచ్చింది.. తడాఖా చూపుతాం

వైసీపీని సాగనంపడానికి సర్పంచ్‌లు సిద్ధం



- జగన్ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు శూన్యం
- కేంద్రం నిధులు కూడా దారి మళ్లింపు
- హక్కుల కోసం రోడ్డెక్కి పోరాటం చేసినా ఫలితం శూన్యం
- ఈ ఎన్నికల్లో సత్తా చూపుతామంటున్న పల్లె పాలకులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 30: సర్పంచ్ అంటే ఆ గ్రామ పంచాయతీకి మకుటం లేని మహారాజు. నీళ్లు కావాలన్నా, రోడ్డు కావాలన్నా, పారిశుధ్య పనులు చేయాలన్నా అన్నింటికి సర్పంచే ఆధారం. ఆ పంచాయతీ ప్రజలకు కూడా సర్పంచ్ అంటే గౌరవం. ఇదంతా గతం. వైసీపీ పాలనలో గ్రామ సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోగా కేంద్రం నిధులను సైతం దారి మళ్లిస్తోంది. దీంతో విధులు తప్ప నిధులు లేని పాలకులుగా వారు మారిపోయారు. సమస్యలపై నిలదీసే ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని సంబంధిత కార్యాలయాల వద్ద అనేకమార్లు ధర్నాలు సైతం చేశారు. అయినా ఫలితం శూన్యం. ఈక్రమంలోనే వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపడానికి పల్లె పాలకులు సిద్ధమయ్యారు. ఇందులో ఎక్కువ శాతం మంది వైసీపీ మద్దతు సర్పంచ్‌లే ఉండటం గమనార్హం. దీంతో ఎన్నికల్లో సహకరించమని అడిగే నాయకులు, అభ్యర్థులతో మాకు ఇన్నాళ్లు ఏం చేశారని సహకరించాలని ఎదురు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

31 మండలాలు..577 పంచాయతీలు .. 575 మంది సర్పంచులు

జిల్లాలోని 31 మండలాల్లో 577 పంచాయతీలకు 575 మంది సర్పంచులున్నారు. కోర్టు వివాదం కారణంగా నారాయణపురం పంచాయతీ ప్రత్యేక అధికారి పాలనలో ఉంది. నగర పంచాయతీ నుంచి పామిడి డీగ్రేడ్ చేయడంతో తిరిగి గ్రామ పంచాయతీగా మారింది. అయితే ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేక పాలన నడుస్తోంది. మిగిలిన 575 మంది సర్పంచుల్లో మెజారిటీ సభ్యులు వైసీపీ మద్దతుదారులే ఉన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం సర్పంచుల హక్కులను హరించి డమ్మీలను చేయడంతో వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వ పెద్దల ఆటలు సాగాయి. ఇప్పుడు మా టైం వచ్చింది. మా సత్తా ఏమిటో చూపుతామని బహిరంగంగానే చెబుతున్నారు.

రూ.8,660 కోట్లు దొంగిలించారని ఫిర్యాదు

రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల నిధులు రూ.8660 కోట్లు దొంగిలించారని పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో జిల్లాలో పలు మార్లు కలెక్టర్, ఎస్పీ, జడ్పీ సీఈఓ, డీపీఓ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోని 12918 పంచాయతీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.8660 కోట్లు కేటాయిస్తే.. అవి సర్పంచుల అకౌంట్స్‌కు జమ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమస్యపై పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లకు విన్నవించిన ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేని కారణంగా పంచాయతీల్లో నీటి సమస్య వచ్చిన, కనీసం వీధి లైటు కూడా మరమ్మతు చేయించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని అనర్థాలకు కారణమైన వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తే తప్ప పంచాయతీలకు మనుగడ ఉండదని భావించిన సర్పంచ్

తోటలోని ఇంట్లోకి చొరబడ్డ దొంగలు

నాటు తుపాకులు, కత్తులతో బెదిరింపు.. రూ.40 వేలు.. 10 తులాల బంగారం దోపిడీ





చెల్లాచెదురుగా పడిన వస్తువులు .. దొంగల దాడిలో ధ్వంసమైన ద్విచక్రవాహనం

కణేకల్లు, మార్చి 30: మండల పరిధిలోని కణేకల్లు క్రాస్‌లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. బళ్లారి రోడ్డులోని తోటలో నివాసముంటున్న రైతు తిప్పారెడ్డి ఇంట్లోకి శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆరుగురు దొంగలు చొరబడ్డారు. నాటు తుపాకులు, కత్తులు చూపించి రూ.40 వేలు నగదు, పది తులాల బంగారు ఆభరణాలను దోచుకువెళ్లారు. తిప్పారెడ్డి తోటలోకి రాత్రి ఏడు గంటల సమయంలో దొంగలు ద్విచక్రవాహనంలో వెళ్లి రెక్కీ నిర్వహించారు. ఇంట్లో ఎంతమంది ఉన్నారో ఆరా తీశారు. గంట తరువాత ఆరుగురు దొంగలు ద్విచక్ర వాహనాలలో వచ్చి తిప్పారెడ్డి ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో ఉన్న డబ్బులు, విలువైన వస్తువులను ఇవ్వాలని నాటుతుపాకులు, కత్తులతో బెదిరించారు. ఆ సమయంలో ఇంట్లో తిప్పారెడ్డి, ఆయన భార్య, తల్లి, తిప్పారెడ్డి మిత్రుడు పురుషోత్తంరెడ్డి ఉన్నారు. తమ వద్ద ఉన్న రూ.40 వేలు నగదు, మహిళల ఒంటిపై ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలను దొంగలు తీసుకున్నారు. బీరువాలను శోధించారు. అందులో ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. దొంగలు వెళుతూ వెళుతూ తన ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారని బాధితులు తెలిపారు. దొంగలు ముఖాలకు జేబు రుమాలలు కట్టుకున్నారని, తెలుగు భాష మాట్లాడారని తిప్పారెడ్డి తెలిపారు. దోపిడీ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చామని బాధితులు తెలిపారు.

వ్యాధిగ్రస్థులకు స్పాట్ వద్దు: యూటీఎఫ్

అనంతపురం విద్య, మార్చి30: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదో తరగతి స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు శనివారం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. గుండె, కిడ్నీ తదితర సమస్యలతో బాధపడుతున్న టీచర్లు, ప్రత్యేక అవసరాలు ఉన్న టీచర్లు, గర్భిణులు, చంటిబిడ్డలు ఉన్న తల్లులకు మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మూల్యాంకనం కేంద్రంలో సరిపడా స్పెషల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. టీచర్లకు సరిపడా బల్లలు, కుర్చీలు వేయాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. ఈ మేరకు ఏడీ క్రిష్ణయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు సరళ, కోశాధికారి రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ప్రమీల, వీరేశ్వరాచారి, చంద్రమోహన్, గంగాధర్, రాజేంద్ర, వెంకటనాయుడు, ఆదిశేషప్ప పాల్గొన్నారు.



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

యువ రైతు ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

కుందుర్పి, మార్చి 30: మండల పరిధిలోని బసాపురం గ్రామానికి చెందిన యువ రైతు హనుమంతు(32) అప్పుల బాధతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమంతు తన పేరిట ఉన్న ఒకటిన్నర ఎకరంతోపాటు తండ్రి పేరిట ఉన్న ఐదు ఎకరాలను, కౌలుకు మరో ఐదు ఎకరాలను తీసుకుని వేరుశనగ పంటను సాగుచేసేవాడు. ఏటా పంట నష్టం జరగడంతో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.5 లక్షలకు పైగా పేరుకుపోయాయి. దీంతో ఒత్తిడి భరించలేక శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య భారతి ఉన్నారు. తండ్రి సంజీవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీకి వలంటీర్లు దూరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 30: పింఛన్‌ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పిస్తూ.. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. వలంటీర్ల ద్వారా ఓటుకు నోటు పంపిణీ చేసేందుకు అధికార పార్టీవారు కుట్రలు పన్నుతున్నట్లు జరుగుతున్న ప్రచారం గురించి ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పలువురు విపక్ష నాయకులు తెలిపారు. దీంతో పింఛన్‌ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించారు. పింఛన్లను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయవద్దని, ప్రత్యామ్నాయంగా డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని, లేదా ఆన్‌లైన్‌లో (డీబీటీ పద్ధతి) పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి శనివారం తెలిపారు. పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రేపటి నుంచి

మెడికల్ క్యాంపులు



అనంతపురం విద్య, మార్చి 30: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకూ మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఏపీసీ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1న గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు, వజ్రకరూరు మండలాల పిల్లలు గుత్తిలోని భవిత కేంద్రానికి, 2న తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాల పిల్లలకు తాడిపత్రిలోని భవిత కేంద్రంలో, 3న బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల పిల్లలు కళ్యాణదుర్గంలోని భవిత కేంద్రానికి, 4న బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, రాయదుర్గం మండలాల పిల్లలు రాయదుర్గంలోని భవిత కేంద్రానికి, 6న అనంతపురం, ఆత్మకూరు, బీకేఎస్, గార్లదిన్నె, కూడేరు, నార్పల, రాప్తాడు, శింగనమల, ఉరవకొండ, విడపనకల్లు మండలాల పిల్లలు అనంతపురంలోని భవిత కేంద్రానికి రావాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు చేయించి ఉపకరణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.



ఇఫ్తార్	ఆదివారం సాయంత్రం	06:33
సెహరీ	సోమవారం ఉదయం	04:58

ఉష్ణోగ్రతలు (శని)

గరిష్ఠం : 41.0

కనిష్ఠం : 25.0




నమో నారసింహా..!



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం (తేరు) శనివారం అత్యంత వైభవంగా జరిగింది. లక్షలాదిమంది తరలిరావడంతో తిరువీధులు కిక్కిరిసి పోయాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైన ఈ రథోత్సవానికి కదిరి చుట్టుపట్ల నుంచే కాకుండా కర్ణాటక, రాయచోటి, పులివెందుల, కడప, మదనపల్లి, చిత్తూరు, తిరుపతి, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. - కదిరి


దవనంతో యువతులు సిద్ధం..


అదిగో స్వామి..


పుణ్యాహవాచనం నిర్వహిస్తున్న వేదపండితులు


రథోత్సవంలో యువకుల విన్యాసం..

గోవిందా.. గోవింద!

కన్నుల పండువగా ఖాద్రీశుడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గోవిందనామస్మరణతో మార్మోగిన తిరువీధులు
- 4.39 గంటల పాటు కొనసాగిన బ్రహ్మరథోత్సవం

కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం




ఇదిగో హారతి..


యువ భక్తుల కోలాహలం...


స్వామితో ఓ సెల్ఫీ..


గొడుగుల నీడలో..

తేరు సాగింది ఇలా..


ఉదయం 8.12 గంటలకు బ్రహ్మరథోత్సవం ప్రారంభమైంది. అంతకు ముందు వేద పండితులు రథారోహనం గావించారు. రథం వద్ద పుణ్యాహవాచనం, బలిహారణ, కుంభహారతి ఇచ్చారు. తర్వాత రథంలో స్వామివారి ఆరాధన, అక్షతారోహనం పూజలు చేసి, శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీవారి విగ్రహాలను బ్రహ్మరథంపై కూర్చో పెట్టారు. అనంతరం భక్తులు తేరును లాగారు. తిరువీధుల్లో భక్తులు స్వామివారికి దవనం, మిరియాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 9.00 గంటలకు చౌక్ వద్ద రథం కొద్దిసేపు ఆగిపోయింది. ఆ తర్వాత భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. వెనుక వైపున కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తెడ్లు వేయడం, మొద్దులు తొక్క డంతో వేగంగా ముందుకు కదిలింది. ఉదయం 9.30 గంటలకు రథం శివాలయం వద్దకు చేరుకుంది. అక్కడ వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గండిబండ ఆంజనేయస్వామి వద్దకు పది గంటలకు చేరుకుంది. అక్కడ నుంచి పడమర రాజగోపురం, గొల్లమ్మ మంటపం, దవన మండపం మీదుగా హిందూపురం క్రాస్ చేరుకుంది. అరగంట పాటు అక్కడే రథం నిలిచిపోయింది. తిరిగి మధ్యాహ్నం 12.20 నిమిషాలకు భక్తుల గోవింద నామస్మరణతో రథం ప్రారంభమైంది. యువ భక్తులు రెట్టించిన ఉత్సా హంతో రథాన్ని లాగారు. మధ్యాహ్నం 12.51 నిమిషాలకు రథం యథాస్థానానికి చేరుకుంది. రథోత్సవం దాదాపు 4.39 గంటల పాటు కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు రథంపై ఉండి భక్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రథోత్సవం ప్రారంభంలో ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తరువాత రథం వెనుక మొద్దులు తొక్కిన కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు మొదటిగా శ్రీవారి దర్శనం కల్పించారు.

కిక్కిరిసిన కదిరి వీధులు

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి శనివారం వేలాది భక్తులు తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో కదిరిలోని వీధులన్నీ అదివారం అర్ధరాత్రి నుండే కిక్కిరిసి పోయాయి. ఆలయ ప్రాంగణం అంతా కాలు మోపడానికి కూడా వీలులేనంతగా భక్తులతో నిండి పోయింది. తేరుపై ఊరేగుతున్న శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు ఎండ వేడిమిని లెక్కచేయకుండా తిరువీధుల్లో మిద్దెలు ఎక్కి, రోడ్లపై నిలబడ్డారు. కదులుతున్న తేరుపై దవనం, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఇక తేరు చక్రాల కింద గుమ్మడికాయలు సమర్పించారు. రథంపై నుండి కిందికి జాలువారిన మిరియాలను ఏరుకోవడానికి భక్తులు ప్రయత్నించారు. భక్తుల కోసం తిరువీధుల్లోనే కాకుండా పట్టణంలోని ప్రధాన వీధుల్లో అనేక రకాల దుకాణాలు వెలిశాయి. యువతీ, యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రయత్నించారు. ఉత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి, భృగుతీర్థంలో స్నానాలు చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.


భానుడి భగభగల నడుమ..


రథంపై కందికుంట ప్రసాద్..


పుణ్యం.. అన్నదానం..

మాటరాని మౌనమిది..!

హామీలను నెరవేర్చని సీఎం జగన్
అందుకే రోడ్ షోలో అభివాదంతో సరి
ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నిరాశ

అనంతపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కీలకమైన ఎన్నికల సమయంలో కరువు జిల్లాలో సీఎం జగన్ రోడ్ షో నిర్వహించారు. కానీ ఎక్కడా ఒక్క మాటా మాట్లాడలేదు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర చప్పగా సాగింది. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి నుంచి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం సంజీవపురం వరకూ శనివారం రోడ్‌షో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ జగన్ అభివాదంతోనే సరి పెట్టారు. మూగనోము పాటించారు. దీంతో పార్టీ అభ్యర్థులు, శ్రేణులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సీఎం మౌనముద్రపై రాజకీయ విశ్లేషకులు సైతం పెదవి విరిచారు. జిల్లా మనవడినంటూ.. ఆయన అలివిగాని హామీలు ఇచ్చారు. మాట తప్పను... మడమ తిప్పను అన్నారు. కానీ ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు.


గుత్తిలో బస్సుపై నిలబడి.. సీఎం జగన్ నమస్కారాలు

ఇవన్నీ మరిచారు..

- అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించేందుకుగానూ రూ.986 కోట్లతో పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం కాలువల తవ్వకాలకు 1400 ఎకరాల భూమి అవసరంకాగా, 500 ఎకరాలకు రూ.200 కోట్లు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడిచినా రైతులకు పరిహారం అందలేదు.
- కృష్ణాజలాలను భైరవానితిప్ప ప్రాజెక్టుకు మళ్లిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఆ ప్రాజెక్టు పూర్తయితే రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. హామీ నెరవేరలేదు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో టీడీపీ హయాంలో చేపట్టిన నేమకల్లు ఆంజనేయస్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తయి ఉంటే బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు, ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందేది. ఇప్పటి వరకూ ఆ రిజర్వాయర్ ఊసేలేదు.
- ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరందించే హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను ఐదేళ్లలో చేపట్టలేకపోయారు. ఈ హామీ గురించి పట్టించుకోలేదు.
- ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలను చాగల్లు రిజర్వాయర్ మునక గ్రామాలుగా గుర్తించారు. ఉల్లికంటిపల్లి ప్రజలకు పరిహారం కింద కొంత సొమ్ము మాత్రమే చెల్లించారు. ఉల్లికల్లు గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తిగా నిలిపివేశారు.
- శింగనమల నియోజకవర్గంలో ఉద్యాన రైతుల ఆదాయం పెంచేందుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిట్టుబాటు ధర అందిస్తామని రైతులను నమ్మించారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.
- వైసీపీ అధికారంలోకి వస్తే ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా ఉపకాలువల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. అదే నీటికోసం ప్రతిపక్ష నేత హోదాలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంపై ధర్నా చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా ఒక్క ఉపకాలువ నిర్మాణాన్ని పూర్తి చేసిందిలేదు.
- హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను నింపుతామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. నల్లమాడ బహిరంగసభలో ఇచ్చిన ఈ హామీ నేటికి కార్యరూపం దాల్చలేదు.
- ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని.. పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు.
- 2019లో ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురానికి వచ్చారు. అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పట్టురైతులు, పట్టు రీలర్లకు అందిస్తున్న ప్రోత్సాహక మొత్తాన్ని కిలో రూ.50 నుంచి రూ.100కు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పెంచలేదు. పైగా రైతులకు ప్రోత్సాహక బకాయిలు రూ.50 కోట్ల మేర బకాయి ఉన్నారు.
- ధర్మవరంలో తయారైన పట్టుచీరలకు ఈ-కామర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2019 డిసెంబరు 21న, జగన్ పుట్టినరోజు సందర్భంగా ధర్మవరంలో నిర్వహించిన చేనేత సభలో ఈ హామీ ఇచ్చారు. ఇంత వరకూ నెరవేరలేదు.
- మడకశిర నియోజకవర్గంలోని 127 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు అందిస్తామని 2019లో హామీ ఇచ్చారు. ఇంత వరకూ మడకశిర చెరువుకు తప్ప... ఇతర మండలాలకు కృష్ణాజలాలు అందించలేదు. 2023 అక్టోబరు 4న రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీమ్ బిల్డింగ్ ప్రైవేట్ కంపెనీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇంత వరకూ దాని ఊసులేదు.
- రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలో దేవరకొండ జలాశయం సహా మూడు రిజర్వాయర్లకు 2020 డిసెంబరు 9న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్లకు భూములు సేకరించే పనులు ప్రారంభం కాలేదు. దేవరకొండ జలాశయం పూర్తి చేసి పిల్లకాలువల ద్వారా చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది.
- ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా రాప్తాడు మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రతిపక్ష నేత హోదాలో రైతుల కోసం రూ.4 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి అమలు కాలేదు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

గుడిబండ, మార్చి 30 : మండలంలోని కొంకల్లు గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీరన్నకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు ఎంపీడీఓ బంగారమ్మ శనివారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వీరన్న వైసీపీ అభ్యర్థి వీరలక్కప్ప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని ఫిర్యాదు అందిందన్నారు. దీంతో షోకాజ్ నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఈ విష యాన్ని మడకశిర రిటర్నింగ్ అధికారి, ఉపాధిహామీ సత్యసాయిజిల్లా పీడీకి నివేదిక అందజేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వలంటీర్లు, డీలర్లపై చర్యలు

అనంతపురం టౌన్, మార్చి 30: ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన మరో రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వజ్రకరూరు మం డలం గడేహోతూరు డీలర్ నాగరాజు వైసీపీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, దీంతో విచారించి విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు 40 మంది వలంటీర్లు, ఎనిమిది మంది డీలర్లు, 11 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని కలెక్టరు తెలిపారు. సి-విజిల్ యాప్‌కు శనివారం ఐదు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 231 ఫిర్యాదులు వచ్చాయని, ఎప్పటికప్పుడు విచారించి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

బస్సుయాత్రలో వలంటీర్

అనంతపురం రూరల్: సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోలో అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వలంటీర్ గణేష్ పాల్గొన్నాడు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా.. పలువురు ఖాతరు చేయడం లేదు.


బస్సుయాత్రకు వెళుతున్న వలంటీర్ గణేష్

వలంటీర్ల తొలగింపు

ఉరవకొండ: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కొల్లారప్ప, రంగప్పను విధులను తొలగించామని హావళిగి పంచాయతీ కార్యదర్శి సురేష్ శనివారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, వలంటీర్ జయన్న రాజీనామా చేశారని ఆయన తెలిపారు.

యానిమేటర్ ప్రచారంపై విచారణ

నల్లమాడ: వంకరకుంట పంచాయతీలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అపర్ణ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో శుక్రవారం యానిమేటర్ 3 శకుంతల పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, ఏపీఎం జయంతి శనివారం గ్రామానికెళ్లి విచారించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

వలంటీర్ ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ గంగాధర్

హిందూపురం: లేపాక్షి మండలం నాయనపల్లిలో శనివారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో గంగాధర్ అనే వలంటీరు పాల్గొన్నాడు. ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటేయాలని కోరాడు.

ఇదిగో నా రాజీనామా...?

గోరంట్ల: బూదిలి పంచాయతీ గంగాదేవిపల్లిలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ బోయ రమేష్ శనివారం రాజీ నామా చేశారు. రెండురోజుల కిందట సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. కార్యదర్శి గంగాధర్ నాయక్ ద్వారా ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ షోకాజ్ నోటీసును శుక్రవారం జారీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈనేపథ్యంలో అధికారులు తొలగించక ముందే సర్పంచ్ రామాంజనేయులు సమక్షంలో వలంటీర్ రమేష్ ఎంపీడీఓ కార్యాలయంలో రాజీనామా చేశారు. దానిని ఎంపీడీఓ ఆమోదించారు.

అంబికాకు ఘనస్వాగతం

హిందూపురం, మార్చి 30 : తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన అనంతరం అంబికా లక్ష్మీనారాయణ శనివారం హిందూపురానికి వచ్చారు. కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకున్న అంబికాకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొడికొండ చెక్‌పోస్టులో అంబికా విలేకరులతో మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల కోసం ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడిజిల్లాలో వాల్మీకులకు టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. మొదటి నుంచి వాల్మీకులు టీడీపీ వెంటే నడుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం నుంచి ఎమ్మె ల్యే బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బడుగు బలహీనవర్గాలపై దాడులు పెరిగాయని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. నిన్నటి వరకు పరదాల చాటున తిరిగిన ముఖ్యమంత్రి నేడు ఓట్లకోసం రోడ్డుబాట పట్టారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అరాచకాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, దందాలు, మానభంగాలు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాలకృష్ణ అభిమానులు, వాల్మీకులు పాల్గొన్నారు.


అంబికాకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

రామగిరి, మార్చి 30: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి పరిటాలసునీత సూచించారు. కొత్తగా టీడీపీలోకి చేరినవారు కష్టపడి పనిచేసి పార్టీ గెలుపుకోసం పనిచేయాలన్నారు.శనివారం వెంకటాపురం గ్రామంలో కొత్తగాదికుంట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ, బీజేపీ నాయకులు టీడీపీలోకి చేరారు. వారందరికీ పరిటాలసునీత పార్టీ కండువాలు వేసి సాదారంగా ఆహ్వానించారు. వైసీపీ జిల్లా కార్యదర్శి చిన్నపెద్దన్న, ప్రేమసాయి, చదువు నరసింహులు, చలిచీమల శ్రీనివాసులు, చింతకాయల మాదన్న, నరేశ్, బీజేపీ మండల కన్వీనర్ గొల్లక్రిష్ణయ్య, గొల్లబాలాజీ పార్టీలోకి చేరారు. పార్టీలోకి చేరినవారు మాట్లాడుతూ తాము వైసీపీలో ఎంతో కష్టపడి పనిచేశామని, తగిన ప్రాధాన్యతలేకపోవడంతోనే పార్టీని వీడామన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లాఅధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, మాదాపురం శంకర, ఎస్సీసెల్ పోతన్న, ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వారితో బండారు శ్రావణి

శింగనమల, మార్చి 30: మండలంలోని చిలేపల్లి గ్రామానికి చెందిన 15 వైసీపీకి కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సమక్షయంలో అనంతపురంలో ఆమె స్వగృహంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరినవారిలో మల్లికార్జున, వెంకటేశ్, జయశంకర్, లోకనాథ్, నాగార్జున, భీమార్జున, చంద్రయ్య, మహేశ్, నరేంద్ర, మోహన్‌లకు శ్రావణిశ్రీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోని ఆహ్వానించారు. సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చితంబరిదొర పాల్గొన్నారు.

అనంత ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు

మైనార్టీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న మహబూబ్ బాషా

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 30: వైసీపీ, టీడీపీలు మైనార్టీలకు నమ్మకద్రోహం చేశాయని పలువురు ముస్లిం, మైనార్టీ నేతలు మండిపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో పలువురు మైనార్టీ సంఘాల నేతలు శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఐఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ అనంతపురం ఎంపీ, అర్బన్‌ఎమ్మెల్యే టిక్కెట్ల విషయంలో వైసీపీ, టీడీపీలు రెండూ మైనార్టీలకు తీరని అన్యాయం చేశాయన్నారు. చిన్న చిన్న పదవులు ఇచ్చి మైనార్టీల గొంతు నొక్కే విధంగా ప్రవర్తిస్తున్నాయన్నారు. అనంతపురం అర్బన్‌లో 70 వేల ఓటు బ్యాంకు ఉన్న మైనార్టీల సమస్యలను తీర్చడానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని ప్రధా పార్టీలకు ఎంతచెప్పినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ అయినా ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లను మైనార్టీలకు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. హసన్ బషీర్, అహ్మద్, షౌకత్‌ఖాన్, శర్మాస్, కాంగ్రెస్ మహబూబ్ బాషా, అమ్మ ఆర్గనైజేషన్ షేక్షావలి, అబుబాకర్, జాఫర్, ఆసీఫ్ పాల్గొన్నారు.

తెలుగుతోనే పరిపూర్ణ వివేకం



విద్యార్థులతో ప్రొఫెసర్‌లు

అనంతపురం సెంట్రల్, మార్చి 30: మానవత, సామాజిక, నైతిక, సాంఘిక వంటి విలువలు పెంపొందించే తెలుగు భాషతోనే పరిపూర్ణమైన వివేకవంతులు అవుతారని ఎస్కేయూ తెలుగుశాఖ ప్రొఫెసర్ నరసింహన్ అన్నారు. శనివారం ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సర విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలను నిర్వహించారు. విభాగాధిపతి సదాశివానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ భాషల్లో తెలుగు ద్వితీయ స్థానంలో ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాల నెలవుగా తెలుగుభాష విరాజిల్లుతోందన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు ప్రత్యేక తెలుగు విభాగాన్ని ఏర్పాటుచేసి భాష ప్రాముఖ్యతను చాటుతున్నారన్నారు. జూనియర్లు, సీనియర్లు అన్న తారతమ్యాలువీడి సోదరభావంతో విద్యావిజ్ఞానాన్ని పంచుకోవాలని సూచించారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'కురుగుంటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం'



అంధులకు భోజనం వడ్డిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్ టవర్, మార్చి 30: కురుగుంటను ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతామని ఆర్ట్స్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నగర శివారులోని కురుగుంట అంధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. నెహ్రూ యువకేంద్రం, జాతీయ సేవా సర్వీసెస్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సంతోష్, భరత్, సాయి, అమృత, ఎర్రిస్వామి, భానుప్రియ పాల్గొన్నారు.

చల్లారని ఆవేశం..!

● రుద్రంపేట టీడీపీ కార్యాలయంలో ఫర్నిచర్ దహనం



రుద్రంపేట పార్టీ కార్యాలయం బయట ఫర్నిచర్‌ను తగులబెడుతున్న ప్రభాకర్ చౌదరి వర్గీయులు

అనంతపురం రూరల్, మార్చి 30: మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి టీడీపీ టిక్కెట్ కేటాయించకపోవడంతో ఆయన వర్గీయులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రుద్రంపేటకు చెందిన టీడీపీ శ్రేణులు శనివారం మండలంలోని రుద్రంపేట పంచాయతీ టీడీపీ కార్యాలయంలోని ఫర్నిచర్, జెండాలు, పథకాలకు సంబంధించిన క్యాలెండర్లు ఇతరాత్రా వాటిని ధ్వంసం చేశారు. వాటిని రోడ్డుపై పడవేసి దగ్ధం చేశారు. పార్టీ కార్యాలయం గోడలకు రాసిన టీడీపీ పథకాల వివరాలు కనిపించకుండా రంగు చల్లారు. ప్రభాకర్ చౌదరికి తీవ్ర అన్యాయం చేశారంటూ ఆందోళన చేపట్టారు.

రాప్తాడులో నీవు చేసిన అభివృద్ధి ఎక్కడో చూపు ప్రకాష్

● మాజీ మంత్రి పరిటాల సునీత



కరపత్రాలను అందజేస్తున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మార్చి 30: రాప్తాడులో ఈ ఐదేళ్లలో నీవు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలవా అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి మాజీ మంత్రి పరిటాల సునీత సవాల్ విసిరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చలేని నీవు, ప్రాజెక్టులు కడతానని ప్రజలను మోసగిస్తున్నావన్నారు. రాప్తాడు ప్రజలు నిన్ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మండలంలోని ముష్టికోవెల, సుబ్బరాయునిపల్లి, న్యామద్దల గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఆమెకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలు, విధ్వంసాలే తప్పా ప్రజలకు చేసిందేమిలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఐదేళ్లపాటు అన్నిచెరువులకు నీరిచ్చి తాగునీటి సమస్య లేకుండా చేశానన్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఐదేళ్లలో ఒక్క రిజర్వాయర్‌ను పూర్తీ చేయలేని ఎమ్మెల్యే ఇప్పుడు మరోసారి అవకాశం ఇస్తే సోమరవాండ్లపల్లి ప్రాజెక్టును పూర్తీ చేస్తానంటూ ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. రాప్తాడులో ఎమ్మెల్యే, ఆయన సోదరులు ఎంతసేపు మట్టి, ఇసుక, భూ మాఫియాలు చేసుకుని ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎమ్మెల్యే మాటలు ప్రజలు వినే పరిస్థితుల్లో లేరని రాప్తాడులో ఈ సారి టీడీపీగెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్ నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు, ముత్యాలప్ప, అంకే అమరేంద్ర,న్యామద్దల కిష్టప్ప, ప్రసాదమ్మ, నరసింహులు, ఈశ్వరయ్య,రామాంజినేయులు, పోతన్న, భాస్కర్, మాడెం సూర్యనారాయణరెడ్డి, రామాంజి, శివ, బండారు భార్గవ, సుబ్బరాయుడు, హేమాద్రి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక: మాజీ మంత్రి పరిటాలసునీత ఎన్నికల ప్రచారం సందర్భంగా పార్టీలోకి చేరికల పర్వం కొనసాగింది. ముష్టికోవెల, సుబ్బరాయుని పల్లి గ్రామాల్లో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వారందరికి పరిటాలసునీత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి చేరినవారిలో తలారి నాగరాజు, ఆదినారాయణ, నాగేంద్ర, నాగలక్ష్మీ, శ్రీరాములు, ఆంజనేయులు, రామన్న, చలపతి, ఆంజనేయులు, చలపతి, పరందామ, పవన్‌కల్యాణ్, నరసింహులు, రామాంజినేయులు, రామకృష్ణ, ఈశ్వరయ్య, ముత్యాలప్ప, చిరంజీవి, నవీన్ ఉన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం



నార్పలలో ప్రచారం చేస్తున్న ఆలం నరసానాయుడు



అనంతపురం రూరల్ పూలకుంటలో...

సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. నార్పల మండలం గంగనపలి, ముచ్చుకుంటపల్లిలో శనివారం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిని గెలిపించాలని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు ఓటర్లను అభ్యర్థించారు. అనంతపురం రూరల్ మండలం పూలకుంట గ్రామంలో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలో రాప్తాడు అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీతను గెలిపించాలని మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. రాప్తాడు మండలం గొల్లపల్లిలో ధర్మవరపు మురళీ ప్రచారం చేశారు. రామగిరి మండలం నసనకోటలో నాయకులు ప్రతి ఇంటి వెళ్లి పరిటాల సునీతను గెలిపించాలని ఓటర్లకు విన్నవించారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఆత్మకూరులో...



రాప్తాడు మండలం గొల్లపల్లిలో...



రామగిరి మండలం నసనకోటలో...

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా!

● ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌చోరీ
● పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ధర్మవరంరూరల్, మార్చి30: ధర్మవరం మండలంలోని సీతారంపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్నకాటమయ్యకు దాదులూరు రెవెన్యూ గ్రామంలో పొలం ఉంది. అక్కడ బోరుబావి తవ్వించి వేరుశనగ, వంకాయ, జామపంటలు సాగుచేస్తున్నాడు. వారంరోజుల క్రితం ఆ రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌ను గుర్తుతెలియని దుండగులు



నీరు లేక ఎండిపోతున్న వేరుశనగ పంట

చోరీ చేశారు. అప్పటినుంచి విద్యుత్‌సరఫరా లేక బోరు బావి ఆడకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. ఆయిల్‌చోరీ విషయంపై ట్రాన్స్‌కో అధికారులకు విన్నవిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని తీసుకురావాలని పోలీసులు చెబుతున్నారని రైతు తెలిపాడు. ఇదే విషయంపై కనగానపల్లి పోలీసులకు తెలపగా చోరీకి గురైనట్లు ఎఫ్ఐఆర్ కాపీని పంపిస్తామని తెలిపినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వారంరోజులుగా ట్రాన్స్‌కో అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించకపోవడంతో పంటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయని, అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయాలని రైతు విజ్ఞాప్తి చేశారు.



ఆయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతు చిన్నకాటమయ్య

నేడు రైతులకు అవార్డుల ప్రదానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 30: సామాజిక సహజ వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులకు అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ప్రతిపాదిత కింగ్స్ గ్లోబల్ డే ఆఫ్ సర్వీస్, ఆసియోన్ ప్రొటెర్నా సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 8.30గంటలకు రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖి, 9.30గంటలకు సహజంగా లభించే మల్చింగ్ మెటీరియల్ సేకరణ ఉంటుందన్నారు. అనంతరం అక్కడి నుంచి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ వరకు రైతుల ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 10.30గంటలకు కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ యాప్ పోస్టరు విడుదల, రైతు అవార్డులు ప్రదానోత్సవం నిర్వహిస్తామన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.28 వేలు

అనంతపురంరూరల్, మార్చి 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.28వేలు, కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 781 టన్నులు కాయలు వచ్చాయన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోండి



నార్పల, మార్చి 30: నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024సంవత్సరానికి పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డెవిడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు తరగతులు ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, పాసైన విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. మరిన్ని వివరాల కోసం 8096907527 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నగరపాలికలో హెల్ప్‌లైన్

అనంతపురం క్రైం, మార్చి 30: నగర ప్రజల సౌకర్యార్థం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వార్డులో తాగునీటి సరఫరా, లీకేజీలు, వీధిలైట్లు, పారిశుద్యం తదితర సమస్యలపై 08554-274765, 230234 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలను తెలియజేయాలని కమిషనర్ మేఘస్వరూప్ కోరారు. సంబంధిత ఉద్యోగులు వాటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలపై అలసత్వం వహిస్తే సంబంధిత ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

చౌదరికి టిక్కెట్ దక్కలేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

● ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేసిన తెలుగు మహిళలు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు నాగరాజు, మమత

అనంతపురం అర్బన్, మార్చి 30: టీడీపీ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్ ప్రభాకర్ చౌదరికి కేటాయించకపోవడంపై అనంతపురం రూరల్ మండలం నారాయణపురం పంచాయతీకి చెందిన దంపతులు నాగరాజు, మమత విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. శనివారం అనంతపురం నగరంలోని ప్రభాకర్ చౌదరి ఇంటి వద్దకు ఆ దంపతులు వచ్చారు. ప్రభాకర్ చౌదరికి టిక్కెట్ ఇవ్వకుంటే మేము ఎలా బతికేదంటూ కన్నీటీపర్యంతమయ్యారు. తమ వెంట తెచ్చుకున్న విషద్రావకాన్ని తాగేశారు. అక్కడే ఉన్న నాయకులు, కార్యకర్తలు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మేము రామంటూ భీష్మించారు. బలవంతంగా వారిని వాహనంలో ఎక్కించి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులను ప్రభాకర్ చౌదరి పరామర్శించారు. ఇలా ఎందుకు చేశారంటూ ఆయన కన్నీరు పెట్టుకున్నారు. దంపతుల కుమారుడు నాన్నా అంటూ ఏడుస్తుండగా అక్కున చేర్చుకొని ఏం కాదంటూ భరోసానిచ్చారు. అలాగే అనంతపురం అర్బన్ ఆఫీస్ వద్ద శుక్రవారం విషద్రావకం తాగి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో టీడీపీ కార్యకర్త వెంకటసతీష్‌ను ప్రభాకర్ చౌదరి పరామర్శించారు. ప్రభాకర్ చౌదరికి టికెట్ కేటాయించకపోవడంపై శనివారం రెండో రోజు నగరంలోని రుద్రం పేట సర్కిల్‌లో తెలుగు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కండువాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలను దహనం చేశారు.

ఆత్మస్థైర్యం కోల్పోకుండా పోరాడాలి

\- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి



కంటతడి పెడుతున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్ టిక్కెట్ మరొకరికి కేటాయించడంపై ఆవేదన, అభిమానంతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా పోరాడాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. శనివారం అనంతపురం ప్రభుత్వాస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు టిక్కెట్ కేటాయించకపోవడంపై ఆవేదన, అభిమానంతో ఆత్మహత్యాయత్నం చేసుకుంటే ఎలాంటి ఫలితం ఉండదన్నారు. స్వార్థరాజకీయాల్లో మీరెందుకు ఉచ్చులో పడతారని, మీ కుటుంబాలు వీధిన పడే పరిస్థితికి రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధిష్టానం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంపై మరింత రెట్టింపు ఉత్సాహంతో పోరాడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ కార్యకర్తలే తమ కుటుంబ సభ్యులను చంద్రబాబు అంటూఉంటారని, అలాంటి కార్యకర్తలు ఆవేదనతో ఆత్మహత్యకు యత్నిస్తే వారిని పమార్శించి, యోగక్షేమాలు చూసుకోవాల్సిన బాధ్యత పార్టీ పెద్దలకు ఉండాలన్నారు.

దగ్గుబాటిని గెలిపించుకుంటాం

● జనసేన నాయకుడు భవానీ రవికుమార్



భవానీ రవికుమార్‌ను సన్మానిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 30: పొత్తుధర్మాన్ని పాటిస్తూ టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను గెలిపించుకుంటామని జనసేన పార్టీ కార్యనిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ అన్నారు. టీడీపీ అర్బన్ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ భవానీ రవికుమార్ నివాసానికి శనివారం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని దగ్గుబాటి భవానీని కోరారు. రవికుమార్ మాట్లాడుతూ... పొత్తులో భాగంగా తమవంతు బాధ్యతగా సహకరిస్తామన్నారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వకండి: కలెక్టర్



బోరును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

గార్లదిన్నె, మార్చి 30: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా ఎం గౌతమి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రం, కల్లూరు గ్రామం వద్దనున్న తాగునీటి పథకాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ వాటర్ క్యాంపెయిన్ చెపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఈఈ జవహర్‌కుమార్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

మండే ఎండలతో మరింత జాగ్రత్త

అనంతపురం టౌన్, మార్చి 30: వేసవి కావడంతో ఎండలు మండిపోతున్నాయి, వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు గౌతమి శనివారం ఓప్రకటనలో సూచించారు. ఎండ తీవ్రతకు గురికాకుండా బయటకు వస్తే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెత్తినటోపీకానీ రుమాలు కానీ వేసుకోవాలన్నారు. ఎండాకాలంలో తెలుపురంగు కాటన్ దుస్తులనే ధరించాలని, వీలైనంతమేరకు ఇళ్లవద్దనే ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. దాహం వేయకపోయినా తరుచూ నీటిని తాగాలని, ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్లను సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

డీ.హీరేహాళ్, మార్చి 30: మండలంలోని పాతహడగలి గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హడగలి గ్రామ సమీపంలోని రైల్వేగేటు మీద సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళను రైలు ఢీ కొంది. ఈ ప్రమాదంలో మహిళ తల, మొండెం వేరుగా రైల్వేట్రాక్ నందు పడింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని మహిళ..

ఉరవకొండ,మార్చి30: పట్టణంలోని కవితా హోటల్ కూడలిలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో సునీత(34) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరకముక్కలకు చెందిన సునీత ద్విచక్రవాహనంలో వెళ్తుండగా టిప్పర్ ఢీకొనింది. ఆమె చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఆమెను స్థానికులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

తాడిపత్రిటౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణతోపాటు మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు.

మానసిక రోగుల పట్ల వివక్ష వద్దు

అనంతపురం టౌన్, మార్చి 30: మానసిక రోగుల పట్ల వివక్షత చూపకూడదని సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం మానసిక విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మానసిక వ్యాధిగ్రస్థు పెరుగుతున్నారని, వీటికి పలు కారణాలు ఉన్నాయన్నారు. అందుకే వీరి పట్ల వివక్ష చూపకుండా అవగాహన పెంచితే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, మానసిక వైద్య విభాగం ఇన్‌చార్జి డాక్టర్ శారద పాల్గొన్నారు.

కళాశాలలే మానవ వనరుల తయారీ కేంద్రాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నారాయణరెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 30: ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దే కళాశాలలే మానవ వనరుల తయారీ కేంద్రాలని జేఎన్‌టీయూ ఎంబీఏ కళాశాల అధిపతి ప్రొఫెసర్ నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని శ్రీసాయి మాస్టర్ మైండ్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాలను శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు ప్రొఫెసర్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బసవయ్య, రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించే మొదటిమెట్టు డిగ్రీతో ప్రారంభమవుతుందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

రాప్తాడు, మార్చి 30: అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి వంశీబాబు తెలిపారు. మండలంలోని హంపాపురం సమీపాన గల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజలకు ఆయుధం లాంటిదన్నారు. రాప్తాడు తహసీల్దార్ సీతారామన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎడిఫై స్కూల్‌లో విద్యార్థులను చేర్చకండి

అనంతపురం విద్య, మార్చి 30: బుక్కరాయసముద్రం మండలంలోని వడియంపేట వద్దనున్న ఎడిఫై స్కూల్‌లో విద్యార్థులను చేర్చవద్దని డీఈఓ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఆ స్కూల్‌లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. అయితే ఆ స్కూల్ యాజమాన్యం పాఠశాల ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి ఉత్తర్వులు పొందలేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆ స్కూల్‌లో అడ్మిషన్లు తీసుకుంటే...వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు అందజేస్తున్న ఆర్ఎంఓలు, ట్రస్టుచైర్మన్ శ్రీధర్

అనంతపురం, టౌన్, మార్చి 30: జిల్లా ఆస్పత్రిలో పుట్టుకతో దృష్టిలోపాలు ఉన్న పిల్లలకు శనివారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. డీఈఐసీ సెంటర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి కంటిచూపు సమస్య ఉన్న పిల్లలను తల్లిదండ్రులు తీసుకొని వచ్చారు. కంటి డాక్టర్లు పద్మావతి, వైఎంఎస్ ప్రసాద్ వారికి పరీక్షలు నిర్వహించారు. 55 మంది పిల్లలకు కంటిలోపాలు ఉన్నట్లు గుర్తించడంతో వారికి తాళంకి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అద్దాలు అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, ట్రస్టుచైర్మన్ తాళంకి శ్రీధర్, డీఈఐసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణస్వామి, మేనేజరు రక్షిత పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 240 కుటుంబాలు



టీడీపీలోకి చేరినవారితో అమిలినేని సురేంద్రబాబు



టీడీపీలో చేరిన బోరంపల్లి గ్రామస్థులు

కళ్యాణదుర్గం, మార్చి 30 : కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామం నుంచి భారీగా టీడీపీలో చేరారు. ఆదివారం ప్రజావేదిక వద్ద చేరిన 240 వైసీపీ కుటుంబాలను ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రా మస్థులు మాట్లాడుతూ కళ్యాణదుర్గానికి సాగు, తాగునీరు అందించగల భగీరథుడు అమిలినేని సురేంద్రబాబు ఒక్కరే అన్న నమ్మకంతో ఆయనకు మద్దతు పలికి టీడీపీలో చేరామన్నారు.

● బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరందరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

● కుందుర్పి మండల పరిధిలోని ఎస్ మల్లాపురంకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 45 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీ కండువాలు వేసి టీడీపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక



దళిత కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 30: గుమ్మఘట్ట మండలంలోని రంగచేడు గ్రామానికి చెందిన 30 మంది దళిత కుటుంబాలు శనివారం టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలవ సన్నన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రంగచేడుకు చెందిన కె రుద్రన్న, డీ కొల్లన్న, ఈశ్వర్, మారెప్ప, దువా మహేష్, కోవా మల్లి, దమ్ము ఎర్రిస్వామిలతో పాటు 25 కుటుంబాలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా రాయదుర్గం పట్టణానికి చెందిన పశుపతినాథరెడ్డి ఆధ్వర్యంలో 5 కుటుంబాలు పార్టీలో చేరాయి.

వైసీపీ బీసీ నేత టీడీపీ లోకి..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ : వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలికి చెందిన వైసీపీ నాయకులు శ్రీనివాసులు టీడీపీ లోకి చేరారు. వైసీపీలో బలమైన సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత కావడంతో ఆపార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కౌకుంట్ల గ్రామంలో పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచితస్థానం ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్ర, దస్తగిరి, నాగన్న పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మహిళల అభివృద్ధి

● టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు



రేకులకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గంరూరల్, మార్చి 30: మహిళలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రేకులకుంట గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులును పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాదరంగా ఆహ్వానించి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పేదల ఇంట్లో వెలుగు నింపడమే ధ్యేయమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు పార్టీని వీడి టీడీపీలోకి చేరడంతో పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మంజునాథగౌడ్, సర్పంచ్‌లు అశోక్, రాజశేఖర్‌రెడ్డి, జుంజురపల్లి వన్నూరుస్వామి, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్ శంకర్, నవీన్, కాటా హనుమంతరాయుడు, పోట్ల రవి, డాక్టర్ రామస్వామి, బట్టి తిప్పేస్వామి, సిద్ధప్ప, ప్రసాద్, సోమశేఖర్, స్థానిక నాయకులు మల్లికార్జున, చిక్కణ్ణ, రాము, సత్యన్న, సురేష్, లచ్చన్నచౌదరి, వీరేష్, వన్నూరప్ప, ఉడేగోళం తిప్పేస్వామి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

అమిలినేని గెలుపుతోనే అభివృద్ధి : బీజేపీ



బీజేపీ నాయకులతో సమావేశంలో పాల్గొన్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 30 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. శనివారం కళ్యాణదుర్గంలో విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో బీజేపీ, టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమిలినేనిసురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిలినేని మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ప్రతి అమిలినేని సురేంద్రబాబుకు మద్దతు ఇవ్వాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి చరమగీతం పాడేందుకు సిద్ధం

● జగన్ పాలనతో విసిగిపోయిన ప్రజలు: ఎమ్మెల్యే కేశవ్



మహిళలతో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

ఉరవకొండ,మార్చి30: వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీకి చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని లక్ష్మీనరసింహ, డ్రైవర్స్ కాలనీల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి మహిళలు తీసుకెళ్లారు. తాగునీరు సక్రమంగా రావడం లేదని ఎమ్మెల్యేకి కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ పాలనలో రోజుమార్చిరోజు త్రాగునీటి సరఫరా ఉండేదని, ఇప్పుడు 10రోజులకు ఒక్కసారి కూడా నీరు రావడం లేదన్నారు. నీటి సమస్యపై పాలక పక్షం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ నాయకులు నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. రాబోయే రోజుల్లో నీటిసమస్య మరింత తీవ్రం కానుందన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అన్ని వర్గాలను మోసగించిందన్నారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీసుంకరత్నమ్మ, పట్టణకన్వీనర్ రామాంజినేయులు, టీడీపీ నాయకులు తిమ్మప్ప, సీతారాములు, చందారాము, ముద్దలాపురం రాజు, గోవిందు, బేల్దారు బాషా, బూత్ కన్వీనర్లు బుడేన్, మారెన్న, గుర్రం బుసి, రమేష్, గోపాల్, శర్మస్, శ్రీన పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి ..

● ఇంటింటి ప్రచారంలో కాలవ భరత్



ప్రచారం నిర్వహిస్తున్న కాలవ భరత్

కణేకల్లు, మార్చి 30: ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని గరుడచేడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి కొరకు సూపర్‌సిక్స్ పథకాలను మేనిఫెస్టోలో రూపొందించారని, టీడీపీకి ఓటు వేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. లాలెప్ప, మారుతి, జయశీలారెడ్డి, బీటీ రమేష్, జలంధర్‌రెడ్డి, వెంకటేశులు, వన్నూరుస్వామి, మహేష్ పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : అశ్మిత్ రెడ్డి



తేరన్నపల్లి గ్రామస్థులతో అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి30: గ్రామాల అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తేరన్నపల్లి, టి. తిమ్మాపురం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి, అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగభూషణంరెడ్డి, ప్రసాద్‌నాయుడు, చల్లా సూరి, వెంకటనాయుడు, జనసేన నాయకులు నరసింహాచారి, బాషా, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● ఇంటింటి ప్రచారంలో విక్రమ్ సింహ

కూడేరు/బెళుగుప్ప, మార్చి 30 : పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్ సింహ కోరారు. మండలంలోని ఆవులెన్న, విరుపాపల్లి గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ సూపర్‌సిక్స్ పథకాలపై విక్రమ్ సింహ అవగాహన కల్పించారు. కూడేరు మండలం మరుట్ల 3వకాలనీ, ఉదిరిపికొండ తండాల్లో విజయ్ సింహకు గజమాలతో అభిమానులు ఘన స్వాగతం పలికారు.



కూడేరులో విజయ్ సింహని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

అమిలినేనిని గెలిపిస్తే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తాం : యశ్వంత్



ఇంటింటి ప్రచారంలో అమిలినేని యశ్వంత్

కళ్యాణదుర్గం, మార్చి 30 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబును గెలిపిస్తే కళ్యాణదుర్గం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ హామీ ఇచ్చారు. శనివారం కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డులో అమిలినేని యశ్వంత్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి

బ్రహ్మసముద్రం : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు మేలు జరగనుందని టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కుటుంబసభ్యులు రాహుల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బుడిమేపల్లి గ్రామంలో పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ తిమ్మప్ప చౌదరి, రెస్టారెంట్ ఛార్జ్ నాగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

డీ.హీరేహాళ్, మార్చి 30: మండలంలోని పాతహడగలి గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హడగలి గ్రామ సమీపంలోని రైల్వేగేటు మీద సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళను రైలు ఢీ కొంది. ఈ ప్రమాదంలో మహిళ తల, మొండెం వేరుగా రైల్వేట్రాక్ నందు పడింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్యో విచారణలో తెలియాల్సి ఉంది.

టిప్పర్ ఢీకొని మహిళ..

ఉరవకొండ,మార్చి30: పట్టణంలోని కవితా హోటల్ కూడలిలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో సునీత(34) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరకముక్కలకు చెందిన సునీత ద్విచక్రవాహనంలో వెళ్తుండగా టిప్పర్ ఢీకొనింది. ఆమె చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఆమెను స్థానికులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు.

తక్కళ్లపల్లిలో ఘర్షణ

పుట్లూరు, మార్చి30: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో భూమి విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణపడినట్లు శనివారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చాగం రామకృష్ణారెడ్డి, చాగం చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు మాట మాట పెరిగి కట్టెలతో కొట్టుకున్నారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 30 : కర్ణాటక నుంచి అక్రమ మద్యం తరలిస్తుండగా దాడి చేసిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ వెంకట్ తెలిపిన వివరాల మేరకు శనివారం పట్టణ సమీపంలోని మల్లాపురం క్రాస్ వద్ద 624 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని వైఎస్ఎస్ కోట నుంచి కళ్యాణదుర్గానికి ద్విచక్రవాహనాల్లో టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్, మార్చి 30: వివిధ కేసులలో పట్టుబడ్డ రూ. 3.24 లక్షల కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 24 కేసుల్లో రూ. 2.74 లక్షల విలువ చేసే 603 లీటర్ల కర్ణాటక మద్యం, అదే విధంగా సెబ్ అధికారుల పరిధిలో 19 కేసుల్లో రూ. 50 వేలు విలువ చేసే 70 లీటర్ల కర్ణాటక మద్యాన్ని పట్టణ శివారులో సెబ్ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట అగ్నిప్రమాదం



కాలిపోతున్న టైర్లు

కూడేరు, మార్చి30 : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం పక్కనే మంటలు రేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం పక్కనే ఉన్న చెత్త అంటుకోవడంతో అప్రమత్తమైన కరెంట్ సిబ్బంది తక్షణం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పక్కనే ఉన్న పలు దుకాణాల వరకు మంటలు చెలరేగాయి. సమీపంలోనున్న టైర్లు కాలిపోయి పొగ దట్టంగా రావడంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంటలను అదుపు చేసి ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

కేజీబీవీల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ/బొమ్మనహాళ్, మార్చి 30: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు చదివే బాలికలు ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రిన్సిపల్ కమలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడిమానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల బాలికల విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉందని అన్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డుల జిరాక్స్ రేషన్‌కార్డు, కుల, ఆదాయ, స్టడీ ధ్రువీకరణ పత్రాలను జతపరచాలన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా మరియు సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో ప్రచురిస్తామన్నారు.

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ,మార్చి30: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై వెంకటరమణుడు



యల్లనూరు, మార్చి30: మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పురవీధుల్లో విహరించారు.

ఆలయానికి రూ.50వేల విరాళం



నగదును అందజేస్తున్న చితంబరయ్య

పామిడి, మార్చి 30: పట్టణంలోని బొడ్రాయి వద్ద గల కోట ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు భక్తుడు ఇల్లూరు చితంబరయ్య శనివారం విరాళం అందజేసి తన భక్తిని చాటుకున్నారు. ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 50,116 అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు తనవంతు సాయం అందజే శారన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపిస్తాం : బీజేపీ

గుంతకల్లుటౌన్, మార్చి30: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపిస్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అత్యధిక ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజినేయులు, అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, బీజేవైం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, నాయకులు గుర్రం సూర్యనారాయణ, కొలిమిశేఖన్న, మహేశ్వర్, వెంకటేశ్వర్లు, కేశవ్, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కష్టాన్ని గుర్తించాలి : సీపీఐ

తాడిపత్రిటౌన్, మార్చి30: అంగన్‌వాడీ కార్యకర్తల కష్టాన్ని గుర్తించి వారికి కనీస వేతనాలు చెల్లించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నెహ్రూపార్కు సమీపంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా అంగన్‌వాడీల తలరాత మారడం లేదన్నారు. అంగన్‌వాడీకేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవలకు వారికి తగిన ఫలితం దక్కడం లేదన్నారు. పాదయాత్రలో సీఎం జగన్ అంగన్ వాడీలకు ఇచ్చిన హామీలపై మాట తప్పారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రమణ, శ్రీనివాసయాదవ్, ఉమాగౌడ్, రామాంజనేయులు, అబ్రహం, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌని వెంకటరెడ్డి



రాయదుర్గం, మార్చి 30: రాయదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌని వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాయదుర్గం పట్టణంలో ఎన్నికల అధికారి ఎన్‌సీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. బార్ అసోషియేషన్ అధ్యక్ష పదవికి గౌని వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి ఈసీ వన్నూరుస్వామి మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా జాన్సన్, సంయుక్త కార్యదర్శిగా పృథ్వీరాజ్, కోశాధికారిగా ఎన్‌సీ శ్రీనివాసన్, ఎక్స్ అఫిషియో సభ్యునిగా జగన్‌మోహన్‌రెడ్డిలు నియమితులయ్యారు.

నేడు టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీ ప్రచారం

పుట్లూరు, మార్చి30: మండలంలోని గాండ్లపాడు, ఎస్. తిమ్మాపురం, పోతిరెడ్డిపల్లి, తక్కళ్లపల్లి, జి. వెంగన్నపల్లి గ్రామాల్లో ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఉదయం నిర్వహించే ప్రచారానికి పెద్దఎత్తున మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

యల్లనూరు: మండలంలో శింగనమల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆదివారం నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్లు మండల టీడీపీ నాయకులు చల్లా చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. కార్యక్రమం ఉదయం 9గంటలకు మేడికుర్తి నుంచి ప్రారంభమవుతుందన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు : కలెక్టర్



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

పామిడి, మార్చి 30: వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. మండల కేంద్రమైన పామిడిలోని శ్రీ సత్యసాయి మంచి నీటి పథకం పంప్ హౌస్‌ను శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాగునీటి వృథాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేసి, ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పైపులైన్‌ల లీకేజీలు, బోర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలన్నారు. ఎక్కడ తాగునీటికి ఇబ్బంది కలిగినా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాష, ఎస్ఈఈ జవహర్ కుమార్, సత్యసాయి బాబా తాగునీటి పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ స్టిక్కర్ల తొలగింపు



స్టిక్కర్‌ను తొలగిస్తున్న వీఆర్ఏ

బొమ్మనహాళ్, మార్చి 30: మండలంలో వైసీపీ నాయకుల స్టిక్కర్ల గోల కలకలం రేపుతోంది. వైసీపీకి చెందిన స్టిక్కర్లను ఆ పార్టీ నాయకులు ఇంటింటికి అతికిస్తూ వెళ్తుంటే అధికారులు ఆ వెనకే వెళ్లి స్టిక్కర్లను తొలగిస్తున్నారు. మండలంలోని గోవిందవాడ పంచాయతీ పరిధిలో కల్లుదేవనహళ్లి, తారకాపురం గ్రామాల్లో జరిగింది. శుక్రవారం సాయంత్రం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ప్ర చారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కొందరు వైసీపీ శ్రేణులు మెట్టు గోవిందరెడ్డి, జగన్ స్టిక్కర్లను ఇళ్ల గోడలకు, కరెంట్ స్తంభాలకు, ఇంటి తలుపులకు అతికిస్తూ వెళ్లారు. సమాచారం తెలుసుకున్న అధికారులు ఎన్నికల కోడ్ కారణంగా స్టిక్కర్లు అతికించరాదని, వీఆర్ఏల ద్వారా స్టిక్కర్లను తొలగించారు. వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా స్టిక్కర్లను అతికించడంపై అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్న ధీమాతో ఎన్నికల కోడ్‌ను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఘనంగా 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ

గుంతకల్లుటౌన్,మార్చి30: ఏసుక్రీస్తు పునరుత్థానం సందర్భంగా యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ఉదయం 6గంటలకు ఆర్‌సీఎం చర్చి ప్రారంభమై పట్టణ పురవీధుల్లో గుండా ఎస్పీజీ చర్చి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు, ఫాదర్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్ జాన్‌బాబు, జనరల్ సెక్రటరీ ఏపీ సాల్మన్‌విజయ్‌రాజ్, సభ్యులు, ఫాదర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాల సమక్షంలో రన్ ఫర్ జీసెస్ వినూత్న సువార్త ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక గుత్తి ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చి నుంచి పట్టణంలోని సీఎస్ ఐ చర్చి వరకు ర్యాలీ కొనసాగింది. ఏసు క్రీస్తు మరణించి తిరిగి వచ్చిన సందర్భంగా ఈ ర్యాలీ చేపట్టామన్నారు. క్రైస్తవ సంఘాల నాయకులు విజయ్‌శేఖర్, ప్రతాప్, సుందర్‌పాల్, కెనడి, పాస్టర్లు, పాల్గొన్నారు.

రేపటి ఇఫ్తార్ విందులో పాల్గొనండి

రాయదుర్గం, మార్చి 30: తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ఇఫ్తార్‌విందులో మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కడ్డిపూడి మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం షాదీమహల్‌లో రంజాన్ ఉపవాసదీక్షలో ఉండే మైనార్టీలకు ప్రార్థనతో పాటు దీక్ష విరమణ, విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీల సంక్షేమాన్ని కాంక్షించి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఇనాయత్, సీనియర్ నాయకులు ఉస్మాన్, జిలాన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు జావీద్, కార్యదర్శి నిస్సార్‌అహ్మద్, వార్డు ఇన్‌చార్జ్ ఖలందర్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

రాయదుర్గంరూరల్, మార్చి 30: పాలీసెట్ - 2024 పరీక్షకు ఉచితంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారిరోడ్డు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు జరిగే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాడిపత్రిటౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణతోపాటు మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు.

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోండి : సీఐ

రాయదుర్గంరూరల్, మార్చి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శనిమహాత్ముడి గుడి ఏరియా, మండలంలోని కొంతానపల్లి గ్రామంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణ, బీఎస్ఎఫ్ అధికారి మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.